క్లుప్తంగా

కళ్లను కాపాడుకోవాలి



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు పీఎల్ఎన్ రాజు, కె.ఎల్.నాయుడు అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో నగరంలోని గొంటివీధిలో ఉన్న కేసీకేర్ ఐ ఆస్పత్రిలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పి.ఎల్.ఎన్. రాజు, కె.ఎల్.నాయుడులను లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ అధ్యక్షతన 50 మంది నిరుపేదలకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీ పీఠానికి రూ.10 వేల విరాళం



నగదు అందజేస్తున్న కనకరాజు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ మహా త్రిపుర సుందరీదేవీ పీఠం రంగులు, అభివృద్ధి నిమిత్తం ప్రభాకర్ కాలనీకి చెందిన ఆరికతోట కనకరాజు, ఉమ దంపతులు రూ.10 వేలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మకు గురువారం అందచేశారు.

పరామర్శ..



బాతువలో సరోజిని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని నక్కపేట, చెట్టుపొదిలాం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను, బాతువ గ్రామానికి చెందిన ముల్లు సరోజిని అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం పరామర్శించారు. సరోజిని ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డొల వెంకటరమణ, బాతువ పీఏసీఎస్ చైర్మన్ పల్లేటి సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యులు బి.అప్పారావు, గేదెల నారాయణరావు, సర్పంచ్‌లు భూపతి సురేష్‌కుమార్, గేదెల మల్లిబాబు, టంకాల సత్యనారాయణ, బైరెడ్డి విష్ణు, దకర సురేష్ తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం రూరల్: తన కుమార్తె ఈ నెల పదో తేదీ నుంచి కనిపించడం లేదని సింగుపురం గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విజయ్‌కుమార్ చెప్పారు.

దత్తాత్రేయునికి క్షీరాభిషేకం



స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నదీ తీరంలోని బాలత్రిపుర కాలభైరవేశ్వరస్వామి పీఠం దేవాలయంలో ఉన్న దత్తాత్రేయ స్వామికి గురువారం అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ నిర్వహణంలో స్వామికి పాలతో అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోటేశ్వరుడికి మహారుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకాలు గురువారం జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో 11 మంది రుత్వికుల మంత్రోచ్చారణతో నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ వైద్యం

● రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



గార: మందులను పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

గార: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. తూలుగు పంచాయతీలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లు, రోగులకు అందించిన ఆరోగ్య పరీక్షలు, మందులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలకు అధికంగా నిధులు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాత, మండల ప్రత్యేకాధికారి బి.రమణమూర్తి, కొయ్యాన నాగభూషణం, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు, యాళ్ల నారాయణమూర్తి, అరవల రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఫరీదుపేట, తోటపాలెం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను గురువారం ప్రారంభించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్పొరేట్‌కు దీటుగా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కళ్లేపల్లి తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎందువలో..

జి.సిగడాం: మండలంలోని ఎందువ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. దేశంలోనే ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించిన రాష్ట్రం మనదేనన్నారు. ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డొల వెంకటరమణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, సర్పంచ్ అల్లు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లవలసలో..

లావేరు: ప్రతీ కుటుంబానికి వైద్యం అందించడం కోసమే సీఎం జగన్‌మోహనరెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. తాళ్లవలస గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. లావేరు, మురపాక పీహెచ్‌సీల వైద్యులు 280 మందికి తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ సురేష్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు భూరాడ చిన్నారావు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కంది నాని, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో..

రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనేదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం-1 గ్రామ సచివాలయంలో రావాడ పీహెచ్‌సీ వైద్యుడు ధర్మాన సుమన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 318 మందికి వైద్య సేవలు అందించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. 76 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 38 మందికి కళ్లద్దాలు అందించారు. ఇద్దరికి కంటి శస్త్ర చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిఫర్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



లావేరు: తాళ్లవలసలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



రణస్థలం: పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



శ్రీకాకుళం రూరల్: కంటి పరీక్షలు పరిశీలిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

ప్రజల చెంతకే వైద్యం

శ్రీకాకుళం రూరల్: ప్రజల వద్దకే మెరుగైన వైద్యాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో పట్టం కట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు కోరారు. పెదగనగళ్లవానిపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యవసర చికిత్సల నిమిత్తం అందుబాటులో అంబులెన్స్‌లను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. పీహెచ్‌సీల్లో మంచి వైద్య సదుపాయాలు, మందులు, రక్త పరీక్షలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ చీకటి గురుమూర్తి, పార్టీ నాయకులు గంగు నరేంద్రకుమార్, గనగళ్ల రాములు, మైలపల్లి పోలీసు, మైలపల్లి శ్రీనివాస్, పుక్కళ్ల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

శభాష్ చిట్టితల్లీ..

జి.సిగడాం: ఈ చిన్నారి పేరు చదువుల నందిత. ఎందువ ఎంపీపీ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడంపై ఆంగ్ల భాషలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో ప్రజలకు వివరించింది. ఈ చిన్నారి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ధారాలంగా వివరించడంతో ఎమ్మెల్యేతోపాటు మండల స్థాయి అధికారులు, నాయకులు అభినందనలు తెలిపారు. చిన్నారికి ఎమ్మెల్యే బహుమతి అందించారు.



జి.సిగడాం: జగనన్న ఆరోగ్య సురక్ష కోసం వివరిస్తున్న చిన్నారి నందిత

యువతలో దేశ భక్తి పెంపొందించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు, సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: యువతలో దేశ భక్తి పెంపొందించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవి ద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్.ఎం.పురం ట్రిపుట్ ఐటీ క్యాంపస్‌లో గురువారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఆ జాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మన భూమి-మన దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత కలశ యాత్ర చేపట్టారు. ప్రతిజ్ఞ, మొక్కలు నాటే కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. డైరెక్టర్ మాట్లాడుతూ దేశం ప్రగతి సాధించాలంటే జాతీయ సమైఖ్యత అవసరమన్నారు. పచ్చదనం పరిశుభ్రతకు ప్రతి విద్యార్థి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థులు తమ వంతుగా సమాజ సేవ చేయాలన్నారు. ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.డి.సుధాకర్‌బాబు, ఏఓ మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మనోవికాస కేంద్రానికి వంట పాత్రల వితరణ



వితరణ చేసిన వస్తువులతో విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బెహరా మనోవికాస కేంద్రాన్ని అరసవల్లి కూడలి వద్దఉన్న శర్వాణి విద్యాలయలోని ఐదో తరగతి విద్యార్థులు గురువారం సందర్శించారు. సామాజిక సేవా దృక్పథంలో భాగంగా స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ డాక్టర్ రేఖ ఆధ్వర్యంలో గ్యాస్‌స్టౌ, వంటపాత్రలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విద్యతో పాటు సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలన్నదే శర్వాణి విద్యాలయం అధినేత అంధవరపు సూరిబాబు ఆశయమన్నారు. పాఠశాల సిబ్బంది ఎ.దీర్ఘమణి, కె.త్రినాథ్ పాల్గొన్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ



పంచపత్రి కషాయాన్ని తయారు చేస్తున్న దృశ్యం

రణస్థలం: వరిలో ఆకు మడత పురుగు వల్ల పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి సువ్వారి సన్యాసిరావు, మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ తెలిపారు. కమ్మసిగడాంలో మన్నె రాంబాబు వరి పొలంలో ఆకుమడత పురుగు నివారణకు పంచపత్రి కషాయం తయారీపై అవగాహన కల్పించారు. కిలో వేపాకు, కానుగాకు, వావిలాకు, సీతాఫలం ఆకు, నేరేడు ఆకు ఇలా ఐదు రకాల ఆకులను ఒక పాత్రలో వేసి అందులో పది లీటర్ల నీటిని వేసి ఒక రాత్రి నానబెట్టాలన్నారు. మరుసటి రోజు బాగా మరిగించి, చల్లార్చిన తర్వాత వచ్చే ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఇలా చేస్తే చీడపీడలను నివారించవచ్చన్నారు. గ్రామ కార్యకర్త గులివెందుల జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది



అన్నప్రసాదాన్ని అందజేస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం కల్చరల్: అన్ని దానాల్లోకి అన్నదానం ఎంతో గొప్పదని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు మార్కెట్లో నిర్వహించిన గణేష్ చతుర్థి ఉత్సవాల సందర్భంగా గురువారం చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని నిర్వాహకులను అభినందించారు. మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు.

మెట్టూరు బిట్-3లోనే కొనసాగించాలి



వివరాలు సేకరిస్తున్న డీఎల్‌పీఓ రమణ

కొత్తూరు: మండలంలోని పెద్దమడి నిర్వాసితుల ఫిర్యాదు మేరకు.. మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు అధ్యక్షతన టెక్కలి డివిజన్ డీఎల్‌పీఓ ఐ.వి.రమణ గురువారం గ్రామసభ నిర్వహించారు. మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీ(ఇరపాడు) పంచాయతీ పరిధి పదో వార్డులో పెద్దమడి గ్రామానికి చెందిన నిర్వాసితులు నివాసం ఉంటున్నారు. రెవెన్యూ లెక్కల ప్రకారం మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీ పంచాయతీలో పరిధిలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ రెండు పంచాయతీల మధ్య సమస్య ఉన్నందున డీఎల్‌పీఓ వివరాలు సేకరించారు. మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీ (ఇరపాడు గ్రామం) పంచాయతీ పరిధిలోనే పెద్దమడి ఉండేదని నిర్వాసితులు డీఎల్‌పీఓకు వివరించారు. ప్రస్తుతం మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీ పేరు పైనే ఆధార్, రేషన్ కార్డులతోపాటు పలు రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తాము నివాసం ఉంటున్న వీధులను మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీలో ఉంచాలని కోరారు.

15న బ్యాడ్మింటన్ టోర్నీ

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక శాంతినగర్‌కాలనీలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న లలిత హోండా ఓపెన్ పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని రామలక్ష్మణ రోడ్‌లోని లలిత హోండా షోరూం ఎండీ ఆకుల ప్రదీప్, మేనేజింగ్ పార్టనర్ జి.భీమారావు కోరారు. గురువారం వారు పోటీలకు సంబంధించిన విషయాలను వెల్లడించారు. టోర్నీకి సంబంధించి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు క్రీడలపై ఉన్న ఆసక్తితో స్పాన్సర్‌షిప్ ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఓపెన్ చాలెంజ్ మాదిరీగా డబుల్స్ విభాగంలో పురుషులకు మాత్రమే పోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విజేతలకు రూ.20 వేల నగదు, మెమెంటోను అందజేస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలను నిర్వహణ కమిటీ ఏర్పాటు చేస్తోందన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 13వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా 9440255255 నంబర్‌ను సంప్రదించి ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

హిరమండలం: పారదర్శక ఓటర్ల జాబితాయే ఎన్నికల కమిషన్ లక్ష్యమని నియోజకవర్గ ఆర్‌ఓ జెడ్పీ సీఈఓ వెంకట్రామన్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎల్‌ఓలు, వీర్వోలతోపాటు అన్ని రాజకీయ పక్షాల నాయకులతో మాట్లాడారు. వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితాకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. తహసీల్దార్ బి.మురళీమోహన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగే శ్రేయస్కరం

హిరమండలం: సేంద్రియ సాగు విధానమే శ్రేయస్కరమని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంబావల్లి గ్రామంలో డీఆర్‌ఆర్, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు వరి పొలాలను గురువారం పరిశీలించారు. తెగుళ్ల నివారణ, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల సోకే ముందు, తరువాత చేపట్టాల్సిన సస్యరక్షణపై సమగ్రంగా రైతులకు వివరించారు. రసాయనాల కంటే సేంద్రియ ఎరువులనే వాడుకోవడం శ్రేయస్కరమన్నారు. కొత్తూరు వ్యవసాయ శాఖ సంచాలకులు బొడ్డేపల్లి రాజగోపాల్, మండల వ్యవసాయశాఖ అధికారి సంధ్య, వీఏఏ కేశవరావు, పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ



ప్రకాశరావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లావేరు: మండలంలోని కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ రాజాపంతుల ప్రకాశరావు తల్లి ఈశ్వరమ్మ ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బల్లాడ జనార్దన్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు లుకలాపు అప్పలనాయుడు గురువారం గ్రామానికి వెళ్లి పరామర్శించి, సంతాపం తెలియజేశారు. పార్టీ నాయకులు తేనేల సురేష్‌కుమార్, పెరుమాళ్ల రమణ, పతివాడ గురునాయుడు పరామర్శించిన వారిలో ఉన్నారు.

నాడు శిలాఫలకం.. నేడు రోడ్డు నిర్మాణం



టీడీపీ ప్రభుత్వ సమయంలో శిలాఫలకం వేసిన మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు



రోడ్డు నిర్మించక ముందు దుస్థితి ఇలా..



పూర్తయిన సిమెంట్ రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో అనేక మండల, జిల్లాస్థాయి కార్యాలయాలు ఉన్నాయి. పాత జాతీయ రహదారి నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు నాటి టీడీపీ ప్రభుత్వ సమయంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పీఆర్ రోడ్ల (ప్లెయిన్) నిధుల నుంచి రూ.50 లక్షలతో తారురోడ్డు నిర్మాణానికి 2018 జూన్ 8వ తేదీన అప్పటి మంత్రి కిమిడి కళా వెంకటరావు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. ఈ రోడ్డు సమస్య గుర్తించిన ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి చొరవ తీసుకున్నారు. మండల పరిషత్ సాధారణ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో 500 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తికావటంతో సమస్యకు పరిష్కారం లభించింది. మండల కాంప్లెక్స్‌లో స్కిల్ కాలేజ్, మహిళా ప్రాంగణం, ప్రభుత్వ ఐటీఐ, మండల పరిషత్, తహసీల్దార్, పీఆర్ ఇంజినీరింగ్, వెలుగు, ఉపాధి హామీ, గృహ నిర్మాణశాఖ వంటి అనేక కార్యాలయాలు, సంస్థలు ఉన్నాయి. నాటి ప్రభుత్వం శిలాఫలకం వేసి వదిలేస్తే, నేటి ప్రభుత్వం రోడ్డు నిర్మాణం పూర్తిచేసింది.

గుర్తింపు కార్డుల పంపిణీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులకు గురువారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ముంగంటి సూర్యనారాయణ గుర్తింపు కార్డులు అందజేశారని నాయీబ్రాహ్మణ సంఘం ఎల్.ఎన్.పేట మండల శాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మల్లేటి సోమేశ్వరరావు, కల్లేపల్లి భాస్కరావులు తెలిపారు. నాయీబ్రాహ్మణుల సమస్యలు డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఎల్.ఎన్.పేట: పర్యావరణం కాపాడేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, వాటిని పెంచే బాధ్యత కూడా తీసుకోవాలని భగవాన్ సత్యసాయి సేవాసంస్థల జిల్లా గ్రామ సేవ ఇన్‌చార్జి మునగవలస రవీంద్రబాబు, ఆమదాలవలస కో ఆర్డినేటర్ పి.మల్లేశ్వరరావు అన్నారు. శ్యామలాపురం గ్రామంలోని సత్యసాయి భజన మండలి ఆధ్వరంలో నాటిన మొక్కలను గురువారం పరిశీలించారు. భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు, బాలవికాస్ గురువు లావేటి శైలజ, యూత్ కో ఆర్డినేటర్ పావని తదితరులు పాల్గొన్నారు.